యూనిట్ II

# 6. ప్రబోధం

- కనుపర్తి వరలక్ష్మమ్మ

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

గాంధీజీ ఒక సభలో ఇలా సందేశమిచ్చారు.
"స్వరాజ్య సాధన స్త్రీల చేతుల్లోనే ఉంది. మీమీ పనుల్లో మీరు నిష్ణాతులు కండి. స్త్రీలు పిరికివారు, బలహీనులు అనే సామాన్యుల వాదాలు మిథ్య అని రుజువు చేయండి. స్త్రీలకు సామాజిక స్పృహ ఉండాలి. వారికున్న నైతికబలం సామాన్యమైంది కాదు. ఈ 'అంతశ్శక్తి' పై ఆధారపడ్డప్పుడు ప్రపంచంలో ఏ శక్తి కూడా ఆమెను ఓడించలేదు".

### ప్రశ్నలు

1. 'స్వరాజ్యసాధన' ఎందుకు అవసరం?
2. సామాన్యుల మిథ్యావాదం ఏమిటి?
3. స్త్రీలల్లో ఉన్న 'అంతశ్శక్తి" ఏది?
4. స్త్రీల గురించి గాంధీజీకి ఉన్న అభిప్రాయాలు ఏమిటి?

© SCERT not to be republished

### ఉద్దేశం

'శారద లేఖల' ను పరిచయం చేయడం,
స్త్రీలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ప్రబోధించడం ఈ పాఠం ఉద్దేశం

ఈ పాఠ్యభాగం కనపర్తివరలక్ష్మమ్మ రాసిన 'శారదలేఖలు' అనే గ్రంథంలోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

సౌభాగ్యవతియగు కల్పలతకు,

భావపురి,
జూలై, 1928.

నెచ్చెలీ, ఒక శుభసమాచారము.

ఏ వనితామణి గంభీరోపన్యాస మాలింపవలెనని భారతీయులెల్లరనిశముత్కంఠ పడుచుందురో అట్టి సుప్రసిద్ధ కవయిత్రియు, విదుషీమణియు, నారీరత్నమునగు శ్రీమతి సరోజనీదేవిగారి మహత్తరోపన్యాసమును ఈ నెల ౨౮.౪.౨౮ (28.04.28) మదనపల్లియందు వింటిని. నీవు వినలేదని యనుకొంటిని. లేఖామూలముగా దెలుపవచ్చును గదాయని మరల తృప్తిగంటిని.

ఈ పురమునందలి హిందూసమాజము వారి యాజమాన్యమున పై సభ జరుపబడినది. నెమలి పట్టాభిరామారావుపంతులుగారి కొమార్తెయగు శ్రీమతి పద్మావతీదేవి(బి.ఎ)గారు నాటి సభకగ్రాసనాధిపురాలు. సమావేశమైన స్త్రీలు కొద్దిమందియైనను వచ్చిన స్త్రీలెల్లరు దాదాపుగా నాంగ్లభాషా పరిచయములేని తెలుగు స్త్రీలేయైనను, శ్రీమతి సరోజనీదేవిగారు మిక్కిలి శాంతముతో స్త్రీలకు సంబంధించిన పెక్కు విషయములను గుఱించి యుపన్యసించిరి. దేవి చెప్పిన ప్రతి వాక్యమునొక మహనీయుడు తెలుగుచేసిచెప్పెను. శ్రీమతి సరోజనీదేవిగారి యుపన్యాస సారాంశ మీ విధముగా నుండెను.

సోదరీమణులారా!

ఢిల్లీ మహిళా సభవారు స్త్రీలకు సంబంధించిన పెక్కు విషయములను గూర్చి చర్చించియున్నారు. బాలబాలికలకు విధిగా విద్యనేర్పవలెననినారు. స్త్రీలకు నియోజక నియోజిత స్వాతంత్ర్యము కావలెనని నారు. అతి బాల్యవివాహము లనర్థకమనినారు. ఇంకను పెక్కు తీర్మానములుగావించియున్నారు. పై విషయములను గూర్చి మన దేశమునందు తీవ్రమైన యాందోళన జరుగుచునేయున్నది. కొన్నిట మనకనుకూలములు గూడా జరుగుచునేయున్నవి. ఇతర విషయములలో మన దేశపు స్థితియెట్లున్నను నియోజిత నియోజక స్వాతంత్ర్యము మాత్రము మన స్త్రీలకు శీఘ్రముగానే లభించినది. పాశ్చాత్య స్త్రీలు విశేష పరిశ్రమచేగాని బడయజాలకపోయిన ఎన్నిక హక్కులు మన దేశపు స్త్రీలకు సులభముగా లభించినవి. తత్ఫలితముగా యీ మదరాసు రాష్ట్ర శాసనసభకు ఒక స్త్రీ డిప్యూటీ ప్రెసిడెంటుగా నెన్నుకొనబడియున్నది. తిరువాన్కూరులో నొక స్త్రీ మంత్రిణిగా నియమింపబడి సమర్థతతో నిర్వహింపుచున్నది. ఇంకను పెక్కు స్థానికసభలలోను, విద్యాసంఘములలోను స్త్రీలు సభ్యురాండ్రుగా నియమింపబడుచున్నారు. కాని యీ స్వాతంత్ర్యపు హక్కులు సమర్థతతో నిర్వహింపగోరుచు స్త్రీలు మంచి విద్యావంతులుగా నుండవలెను. మన దేశపు స్త్రీల విద్యాభివృద్ధికి బాల్యవివాహములు ప్రతిబంధకముగా నున్నవి. వానిని రూపుమాపవలెను. మీరు లక్ష్మీపూజ చేయుదురు. సరస్వతీపూజ చేయుదురుగాని మీ బిడ్డలకు లక్ష్మీప్రసన్నత లేదు, సరస్వతీప్రసన్నత యసలే లేదు. లక్ష్మీయన వేరే లేదు. సరస్వతియన వేరే లేదు. స్త్రీ శక్తిస్వరూపము. కాన స్వశక్తిచేత స్త్రీ లక్ష్మియు, సరస్వతియు కావచ్చును. కాని యట్టి శక్తి యిప్పుడు మీలో స్తంభించిపోయినది. ఎట్టి సాహసకార్యములనైన చేయవలసిన మీరిప్పుడు బిడియమునకును, బిఱికిదనమునకును గుఱియై యశక్తులైపోయినారు. సీత, సావిత్రి మున్నగు విదుషీమణులిట్టి బిడియమును పిఱికిదనమును కలిగియున్నచో నట్టి ప్రసిద్ధములైన కార్యముల చేయగలిగెడివారేనా?

© SCERT not to be republished

మీరు కాశీ రామేశ్వరాది పుణ్యయాత్రలు చేయ తలంచుచుందురు. కాని భూతదయ పశ్చాత్తాపముల చేతను జాతిమత భేదములులేని విశ్వమానవ భ్రాతృత్వము చేతను నకల్మష హృదయముచేతను మన తనువే పుణ్యక్షేత్రముగా జేసుకొనవచ్చును. జీవితమే యాత్ర. అన్నిటికిని మనస్సే ప్రధానము. చిత్తసంస్కారములేని



యాత్రలవలన ఫలము లేదు. తోడిమానవుల నస్పృశ్యులుగా భావించుట తప్పు. మానవులందఱొకటె. స్త్రీ ప్రేమకు స్థానము. ఒక జంతువును చూడుడు. దాని బిడ్డనెవరైన నేమియైన చేయవచ్చిన నెట్లు పోరాడునో అట్లే స్త్రీ గూడా తన బిడ్డల కేమైన ప్రమాదము వచ్చినచో తన ప్రాణములైన నర్పించుటకు సాహసించును. అట్టి ప్రేమను స్త్రీలొక్క తమ బిడ్డలమీదనే కాక తమ యిరుగుపొరుగువారి మీదను తమ దేశముమీదను అంతియేగాదు సర్వమతములవారి యెడలను సర్వమానవులయెడను సమస్త భూతజాలముల యెడలనుగూడ గలిగి యుండవలెను. స్త్రీలకు సౌందర్యము వెలలేని నగలు ధరించుటలో లేదు. నిర్మలమును కరుణాభరితమును ప్రేమపూర్ణమునగు హృదయమును గలిగియుండుటయే స్త్రీకి నిజమైన సౌందర్యము. అట్టి సౌందర్యమును మీరు బడయగోరెదను."

మిత్రమా సరోజనీదేవి యుపన్యాసమునందలి ముఖ్యాంశములివియని జ్ఞాపకము. వీనిలో నేదైనా పొరపాటులున్న అవి నావియే యని యెంచుము.

నీ ప్రియమైన

శారద

## రచయిత్రి పరిచయం



కనుపర్తి వరలక్ష్మమ్మ గుంటూరు జిల్లా బాపట్లలో 6.10.1896న జన్మించారు. ఆమె భర్త కనుపర్తి హనుమంతరావు ప్రోత్సాహంతో సుమారు 50 కథలు, రెండు నవలలు రచించారు. భారతి, గృహలక్ష్మి, అనసూయ, వినోదవాణి, ఆనందవాణి మొదలయిన పత్రికలలో రచనలు చేశారు. గృహలక్ష్మి పత్రికలో సుమారు ఆరు సంవత్సరాలపాటు శారదలేఖలు ప్రచురణ అయ్యాయి. 'లీలావతి' అనే కలం పేరుతో ఆంధ్రపత్రికలో 'మా చెట్టునీడ ముచ్చట్లు' శీర్షికతో రచనలు చేశారు. 'గాంధీ దండకం' రచించారు. దేశభక్తిని, దైవభక్తిని ప్రబోధిస్తూ అనేక పాటలు,పద్యాలు, నాటికలు రచించారు.

ధర్మము నా జీవము, నీతి నా మతము, సతీశ్రేయము నా లక్ష్యం అని ప్రకటించి కలముపట్టి రచనలు చేసిన 'విదుషీమణి' కనుపర్తి వరలక్ష్మమ్మ. వీరి సాహిత్యకృషికి గుర్తింపుగా 1930లో గృహలక్ష్మి స్వర్ణపతకం, 1934లో 'స్వర్ణకంకణం' అందుకున్నారు. 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఉత్తమ రచయిత్రి పురస్కారాన్ని అందించింది. గుడివాడలో జరిగిన సప్తతి మహోత్సవ సన్మానసభలో 'కవితాప్రవీణ' బిరుదును పొందారు. 1975లో ప్రథమ ప్రపంచ తెలుగుమహాసభల స్వర్ణఫలకం, తామ్రపత్ర బహుమతి నందుకున్నారు.

### ప్రక్రియ - లేఖ

వ్యక్తులమధ్య, సంస్థలమధ్య పరస్పరం సందర్భాన్నీ, సంబంధాన్నిబట్టి రాసుకునేవి లేఖలు. కొందరు ప్రముఖవ్యక్తుల ఉత్తరాలను సాహిత్యంగా పరిగణించడం జరుగుతుంది. ఇవి ఆ వ్యక్తుల అభిప్రాయాలనూ, వివిధ వ్యక్తులతో వాళ్ళకున్న పరిచయాలను, సంబంధాలను, సమకాలీన సమాజ జీవనాన్ని, పరిణామాలను తెలియజేస్తాయి.

లేఖలను విమర్శకులు మూడురకాలుగా విభజించారు. వ్యక్తిగత లేఖలు, వ్యాపార లేఖలు, బహిరంగ లేఖలుగా వీటిని పేర్కొనవచ్చు.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది అంశాల ఆధారంగా మాట్లాడండి.**

1. "స్త్రీల విద్యాభివృద్ధికి బాల్యవివాహాలు ప్రతిబంధకములు" దీనిపై మీ అభిప్రాయం తెలపండి.
2. "స్వశక్తిచేత" ఏ పనులనైనా సాధించవచ్చు? నిజమా? కాదా? వివరించండి.

**ఆ) పాఠం ఆధారంగా కిందివాటికి సమాధానాలు రాయండి.**

1. 'లేఖ'ను ఎవరు రాశారు? ఎవరికి రాశారు?
2. సభలో ఉపన్యసించినవారెవరు? సభకు అధ్యక్షురాలు ఎవరు?
3. ఢిల్లీ మహిళాసభవారు చేసిన తీర్మానాలు ఏవి?
4. స్త్రీలకు ఎన్నికహక్కులు లభించడంవల్ల కలిగిన ఫలితాలేవి?
5. తనువే పుణ్యక్షేత్రముగా చేసుకొనవచ్చునని సరోజనీదేవి చెప్పిన అంశాలేవి?

**ఇ) కింది పేరా చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

మలాలా యూసుఫ్‌జా ఈ తరం బాలికల నూతన స్ఫూర్తికి ప్రతినిధి. మలాలా పాకిస్థాన్‌లోని స్వాత్‌లోయ మింగోరా పట్టణంలో 12 జూలై, 1997లో జన్మించింది.

చిన్నప్పటి నుంచి చదువంటే చాలా ఆసక్తిగల మలాలాకు తమ ప్రాంతంలోని ప్రతికూల పరిస్థితులకు ఎదురునిలిచి పోరాడింది. అక్కడి ప్రభుత్వంపై ఆధిపత్యం వహిస్తున్న తాలిబాన్ ఛాందసవాదులు బాలికలు పాఠశాలకు వెళ్ళడం, చదువుకోవడంపై నిషేధం విధించారు. మలాలా ఏ మాత్రం భయపడకుండా చదువుకొంటూనే తన తోటి బాలికలకు చదువుపై ఆసక్తిని పెంచి పాఠశాలకు వెళ్ళేటట్లుగా ప్రోత్సహించింది. దీంతో ఆగ్రహించిన తాలిబాన్లు మలాలాపై 9 అక్టోబర్ 2012న కాల్పులు జరిపారు. ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రాణాప్రాయ స్థితిలోకి వెళ్ళిపోయింది. ప్రపంచవ్యాప్తంగా మలాలాపై సానుభూతి వెల్లువెత్తింది. అందరూ ఆమె కోలుకోవాలని కోరుకున్నారు.

ఆమె ప్రాణాపాయ స్థితి నుండి బయటికి వచ్చింది. మలాలా చైతన్యానికి, సాహసానికి, ఆత్మ స్థైర్యానికి ముగ్ధులైన ఐక్యరాజ్య సమితి నవంబర్ 10వ తేదిన 'మలాలా రోజు' (Malala Day)గా ప్రకటించింది. ప్రతీ బాలిక చదువుకోవడం ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించింది. మలాలాను 'ఇంటర్నేషనల్ చిల్డ్రన్ పీస్‌ప్రైజ్'కు నామినీగా స్వీకరించింది.

అ. మలాలా జన్మించిన ప్రాంతంలోని పరిస్థితులు ఏమిటి?

________________________________

ఆ. తాలిబాన్ ఛాందసవాదులు దేన్ని నిషేధించారు?

________________________________

ఇ. మలాలా బాలికలను ఏ విధంగా ప్రోత్సహించింది?

________________________________

ఈ. మలాలా ప్రాణాపాయ స్థితిలోకి ఎందుకు వెళ్ళింది?

________________________________

ఉ. ఐక్యరాజ్య సమితి మలాలాను ఏ విధంగా గౌరవించింది?

________________________________

**ఈ) కింది వాక్యాలు పాఠంలో ఎక్కడ వచ్చాయో గుర్తించి వాటి సందర్భాన్నిబట్టి భావం రాయండి.**

అ. నియోజిత, నియోజక స్వాతంత్ర్యం మన స్త్రీలకు శీఘ్రంగా లభించినది.

ఆ. మన తనువే పుణ్యక్షేత్రముగా చేసుకొనవచ్చును.

ఇ. చిత్తసంస్కారములేని యాత్రలవలన ఫలము లేదు.



© SCERT not to be republished

## II. వ్యక్తీకరణ- సృజనాత్మకత

**అ) కింది వాటికి ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. ఇరుగుపొరుగువారితో ఎలా ఉండాలో తెలపండి?
2. మనిషికి నిజమైన సౌందర్యం ఏమిటి?
3. 'స్త్రీ శక్తిస్వరూపం' ఈ మాటను సమర్థిస్తూ రాయండి.
4. ప్రతిబంధకాలు అంటే ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి?
5. 'సరస్వతీ ప్రసన్నత' అంటే ఏమిటి? అది ఎప్పుడు లభిస్తుంది?
6. బాలబాలికలకు విధిగా విద్య నేర్పాలని సరోజనీదేవి ఎందుకన్నది?

**ఆ) కిందివాటికి పదిహేను వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. సరోజనీదేవి ఉపన్యాసంలోని ముఖ్యాంశాలను సంక్షిప్తంగా రాయండి.
2. 'స్త్రీవిద్య' ఆవశ్యకతను వివరించండి.
3. స్త్రీల చైతన్యానికి మహిళాసంఘాలు చేస్తున్న కృషిని వివరించండి.

**ఇ) కింద ఇచ్చిన వివరాలను విశ్లేషిస్తూ పది వాక్యాలు రాయండి.**

| అక్షరాస్యత - 2011సం॥ | జాతీయస్థాయి | రాష్ట్రస్థాయి |
|---|---|---|
| పురుషుల అక్షరాస్యత | 82.14% | 75.56% |
| స్త్రీల అక్షరాస్యత | 70.04% | 5974% |
| మొత్తం | 65.46% | 67.61% |

**ఈ) సృజనాత్మకంగా రాయండి.**

సునితా విలియమ్స్ భారతసంతతికి చెందిన అమెరికా అంతరిక్ష పరిశోధకురాలు. ఆమెకు సంబంధించిన వివరాలు కింద ఉన్నాయి. వాటి ఆధారంగా ఆమె జీవితవిశేషాలను వర్ణనాత్మకంగా రాయండి.

- పూర్తిపేరు సునితా పాండ్యకృష్ణ - జననం 19 సెప్టెంబరు 1965.
- అమెరికా అంతరిక్ష పరిశోధకురాలు - అంతరిక్షంలో అత్యధిక సమయం నడిచిన తొలిమహిళ.
- ఎక్కువసార్లు అంతరిక్షయాత్ర చేసిన మహిళ - 1998లో NASA చేత ఎంపిక.
- 2007లో భారత పర్యటన.
- గుజరాత్‌లో స్వగ్రామం (జులాసన్) సబర్మతి సందర్శన - విశ్వప్రతిభ అవార్డ్, ఫస్ట్ పర్సన్ ఆఫ్ ఇండియన్ డీసెంట్ అవార్డు.
- 4 అక్టోబర్ 2007లో "అమెరికన్ ఎంబసీ"లో ప్రసంగం., - భారత ప్రధానితో సమావేశం.
- NASAలో డిప్యూటీ చీఫ్‌గా 2008లో బాధ్యత.

© SCERT not to be republished

ఉ) ప్రశంసాత్మకంగా రాయండి.

రాణి కుటుంబ ఆర్థికపరిస్థితి సరిగా లేకపోవడంవల్ల 7వ తరగతివరకు చదివి బడి మానేసింది. ఉపాధ్యాయురాలి ప్రోత్సాహంతో కస్తూర్బా పాఠశాలలో చేరి పదోతరగతి వరకు చదివి, పదో తరగతి పబ్లిక్ పరీక్షలో 9.7 పాయింట్స్ సాధించి కలెక్టర్‌గారి చేతుల మీదుగా బహుమతినందుకుంది. ఆమెను ప్రశంసిస్తూ లేఖ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

అ) కింది పట్టికలో సమానార్థక పదాలు ఉన్నాయి. వాటి నుండి పట్టిక కింద ఇచ్చిన పదాలకు పర్యాయపదాలు వెతికి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సోదరుడు | పరాక్రమం | పడతి | అగ్రజుడు | తొందర | జాలి |
| స్త్రీ | దయ | విద్వాంసురాలు | స్నేహితురాలు | ఎల్లప్పుడు | మగువ |
| పండితురాలు | మిత్రురాలు | సదా | శౌర్యం | వేగం | సఖి |

1. వనిత, 2. సాహసం, 3. కరుణ, 4. నెచ్చెలి, 5. శీఘ్రం, 6. అనిశం, 7. భ్రాత

ఆ) కిందివాటిలో ప్రకృతి, వికృతులు కలగలిసి ఉన్నాయి. వాటిని వేరుచేసి, ఎదురెదురుగా రాయండి.

ఫలము, లచ్చి, విద్దె, కృష్ణుడు, ఇంతి, లక్ష్మి, పండు, స్త్రీ, కన్నడు, విద్య, శక్తి, సత్తువ.

ఇ) కింది పదాలకు అర్థాలను గుర్తించి కింద గీత గీయండి. ఆ అర్థాన్ని ఉపయోగించి వాక్యాలు రాయండి.

ఉదా:- అనిశం = ఎల్లప్పుడు, అన్నము, గాలి

వాక్యం :- సూర్యుడు ఎల్లప్పుడు తూర్పున ఉదయిస్తాడు.

1. విదుషీమణి = విద్యావంతురాలు, నాయకురాలు, పండితురాలు.
2. నిర్మలం = స్వేచ్ఛ, స్వచ్ఛమైనది, భిన్నంకానిది.
3. కల్మషం = కలశం, కమలం, పాపం.
4. ప్రతిబంధకం = ఎదిరించేది, అడ్డగించేది, తిరిగి బంధించేది.

ఈ) కింది పదాలకు ఎదురుగా వాటి నానార్థాలున్నాయి . వాటినుపయోగించి వాక్యాలు రాయండి.

ఉదా:-. ఫలం : పండు - నేను తిన్న ఫలం తీయగా ఉంది.
ప్రయోజనం- లక్ష్యంలేకుండా పనిచేస్తే ఫలం లభించదు.

1. పురము పట్టణం : ____________________
ఇల్లు : ____________________
2. నారి స్త్రీ : ____________________
వింటితాడు : ____________________

©SCERT not to be republished

## వ్యాకరణం

**అ) కింది కర్మణి వాక్యాలను కర్తరి వాక్యాలుగా మార్చండి.**

1. ఈ పురంలోని హిందూ సమాజంవారి యాజమాన్యంలో పై సభ జరుపబడింది.
2. తిరువాన్కూరులో ఒక స్త్రీ మంత్రిణిగా నియమితురాలు అయింది.
3. విద్యాసంఘాలలో స్త్రీలు సభ్యురాండ్రుగా నియమింపబడ్డారు.

**ఆ) పడ్వాది సంధి**

1. భయము + పడు = భయంపడు, భయపడు.

విడదీసిన పదాలకు కలిపిన పదాలకు తేడా గమనించండి. కలిసిన పదంలో 'ము'కు బదులుగా సున్న(0) వచ్చింది. మరోదానిలో 'ము' లోపించింది.

సూత్రం : పడ్వాదులు పరమగునపుడు 'ము'వర్ణకానికి లోపమూ, బిందువూ (0) విభాషగా అవుతాయి.
పడ్వాదులు : పడు, పట్టె, పాటు.

**ఇ) కిందివాటిని గమనించండి**

1. తృప్తిగంటిని – తృప్తిపొందాను.
2. ఉపన్యసించిరి – ఉపన్యసించారు.
3. తీర్మానములు గావించియున్నారు – తీర్మానాలు చేశారు.
4. లభించినవి – లభించాయి.
5. చేయుదురు – చేస్తారు.

మార్పు దాదాపు చివరి రెండు మూడు అక్షరాలలోనే రావడం గమనించండి. గ్రాంథిక భాషాపదాలు వ్యవహారభాషలోకి మార్చాలంటే– నిత్యం మనం మాట్లాడే భాషను బాగా పరిశీలించాలి.

**కింది పదాలను వ్యవహార భాషలోకి మార్చండి.**

చూడుడు –
సాహసించుచు –
కలిగియుండవలెను –
చేసుకొనవచ్చును –

**ప్రాజెక్టు పని**

వివిధ రంగాలలో ప్రసిద్ధులైన స్త్రీల పేర్లు సేకరించి వారు ఏ రంగంలో పేరు పొందారో పట్టికను రాసి ప్రదర్శించండి.
ఉదా : క్రీడలకు సంబంధించిన వారు, రచయిత్రులు మొదలయిన.

**యతులైనా, మునులైనా, ఎంతటివారైనా స్త్రీని తల్లిగా భావించాలి.**
**– వీర బ్రహ్మేంద్ర స్వామి**

© SCERT not to be republished